# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 3, నవంబరు, 2014

భౌగోళికంగా ఇరుగు పొరుగ రాష్ట్రాలయిన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పరస్పర సహకారంతో మరింత ముందుకు పోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. ఈ రెండు రాష్ట్రాల బంధం చారిత్రాత్మకమైనదని, కాకతీయుల కాలంలో ఈ రెండు ప్రాంతాలు ఒకే రాజ్యంలో ఉన్నాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఇప్పటికీ కాకతీయుల వంశస్తులు ఛత్తీస్‌గఢ్‌లోనే ఉంటున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు. కాకతీయులతో ఉన్న అనుబంధానికి గుర్తుగా కాకతీయ కీర్తి తోరణం ప్రతిమలను ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు అందజేశారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదిరిన సందర్భంగా రాయపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తాము ఎదుర్కుంటున్న సమస్య విద్యుత్ అని, కరెంట్ కష్టాల నుండి ఆదుకోవడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. 1000 మెగావాట్ల విద్యుత్ అందించేందుకు ముందుకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు, ప్రభుత్వానికి కేసిఆర్ కృతజ్ఞతలు తెలిపారు. 14 ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ కొత్త రాష్ట్రంగా ఏర్పడి ఏలాంటి సమస్యలు ఎదుర్కున్నదో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం పరిస్థితి కూడా అలాగే ఉందని సిఎం అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని పెద్దగా పోరాటాలు లేకుండానే సాధించారని వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఛత్తీస్‌గఢ్‌కు ప్రత్యేక రాష్ట్రాన్ని కానుకగా ఇచ్చారని సిఎం తెలిపారు. కాని తెలంగాణ ప్రజలు అనేక పోరాటాలు చేసి జైళ్ల పాలయి రాష్ట్రం తెచ్చుకున్నారని చెప్పారు. జాతీయ రాజకీయ యంత్రాంగాన్ని ఒప్పించి తాము తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని, కాంగ్రేస్, బిజేపి పార్టీలు రెండు తమకు సహకరించాయన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కరెంట్ కష్టాలు ఉన్నాయని,

మూడేళ్లలో వాటిని అధిగమిస్తామని వెల్లడించారు. తెలంగాణ వ్యతిరేక శక్తులు చిన్న రాష్ట్రాల ఏర్పాటు వల్ల అనర్థాలు ఉంటాయని ప్రచారం చేశారని చెప్పారు. అప్పుడు తాను జాతీయ నాయకులకు ఛత్తీస్‌గఢ్‌ను ఉదాహరణగా చూపానని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌ను ఆదర్శంగా తీసుకుని తెలంగాణను అభివృద్ధి చేస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న గోదావరి నదిని ఉమ్మడిగా ఉపయోగించుకోవాలని ప్రతిపాదించారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మించుకోవడం ద్వారా రెండు రాష్ట్రాలకు జల విద్యుత్, సాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ విషయంపై అధికారుల స్థాయిలో చర్యలు జరుపుతామని, తాను కూడా ఈ విషయమ్మై చర్చించేందుకు మరోసారి ఛత్తీస్‌గఢ్ వస్తానని చెప్పారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండానే రెండు రాష్ట్రాల రైతులు పరస్పరం సహకరించుకుంటున్నారని చెప్పారు. ఇక్కడి రైతులు అక్కడికి, అక్కడి రైతులు ఇక్కడికి వచ్చిపోతున్నారని, పంటల సాగులో పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటున్నారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మారుస్తామన్నారు. అందుకు తెలంగాణ వాతావరణం, భూములు, వర్షపాతం అనుకూలంగా ఉన్నాయన్నారు.

## తెలంగాణతో ధృడ బంధం – రమణ్‌సింగ్

తెలంగాణ రాష్ట్రంతో బలమైన సంబంధాలు కొనసాగించాలని అనుకుంటున్నామని, దీర్ఘ కాలికంగా పరస్పర సహకారం అవసరమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఏలాంటి సమస్యలు ఉంటాయో తనకు తెలుసునని చెప్పారు. ఆ సమస్యలను అధిగమించే శక్తి కేసిఆర్‌కు ఉందని చెప్పారు. తెలంగాణకు ఇచ్చే కరెంట్‌ను సరఫరా చేసేందుకు ట్రాన్స్‌మిషన్ లైన్లను త్వరగా నిర్మించాలని తాను కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిని కోరినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం సాధించినందుకు ఛత్తీస్‌గఢ్ ప్రజల తరపున కేసిఆర్‌కు అభినందనలు తెలిపారు.

## ఆకట్టుకున్న కేసిఆర్ ప్రసంగం

రాయపూర్ సభలో ముఖ్యమంత్రి కేసిఆర్ చేసిన ప్రసంగం అక్కడి ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, అధికారులు, మీడియాను విశేషంగా ఆకట్టుకున్నది. తాను హింది భాషను గొప్పగా మాట్లాడలేనని అంటునే ముఖ్యమంత్రి కేసిఆర్ హిందిలో అనర్గళంగా ప్రసంగించారు. కాకతీయుల కాలం నాటి నుండి ఛత్తీస్‌గఢ్ ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. గోదావరి నది కూడా గంగానది లాగే పవిత్రమైనదని ఆ నదీ పరివాహక ప్రాంతాల్లో ఉంటున్న రెండు రాష్ట్రాలు తరించాలని చెప్పారు.

అనంతరం ఛత్తీస్‌గఢ్ మంత్రులు, అధికారులు మాట్లాడుతూ దక్షిణ భారతదేశం ప్రజలకు హింది పెద్దగా రాదని తాము అనుకున్నామని, కేసిఆర్‌ను చూసిన తరువాత తమ అభిప్రాయం మార్చుకుంటున్నామని చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం